www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 17 ఫిబ్రవరి 2025

5

తూర్పుగోదావరి



'ఉపాధ్యాయుడు ఎన్నికల ప్రచారం చేయలేదు'

కాకినాడ: కాజులూరు మండలం కుయ్యేరు జడ్‌పి ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన క్లస్టర్ సమావేశంలో ఉపాధ్యాయుడు నున్నబోయిన గణేష్ నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల ప్రచారం చేసారంటూ చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.సూరిబాబు, కెవివి నగేష్, సదరు ఉపాధ్యాయుడు గణేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా సమావేశంలో ఎన్నికల ప్రచారం చేసారని కొన్ని వార్తా పత్రికలలో వచ్చిన వార్తలను ఖండిస్తున్నామన్నారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో పోటీ చేస్తున్న కొందరు అభ్యర్థుల మద్దతుదారులు ఉపాధ్యాయుల క్లస్టర్ సమావేశాల సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారని, దానిలో భాగంగా గణేష్‌కి కూడా ఒక కరపత్రం ఇచ్చారని తెలిపారు. అంతే తప్ప గణేష్ నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల ప్రచారం నిర్వహించలేదని తెలిపారు.

పాఠశాలలపై రేషనలైజేషన్ కత్తి

- జిల్లాలో తుది దశలో మ్యాపింగ్ ప్రక్రియ
- హైస్కూళ్లలో విలీనం కానున్న ప్రాథమికోన్నత పాఠశాలలు



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రభుత్వ పాఠశాలలపై కూటమి ప్రభుత్వం రేషనలైజేషన్ కత్తి దూస్తోంది. జిఒ ఎంబర్ 117ను రద్దు చేస్తామంటూ ఎన్నికల ముందు కూటమి నేతలు హామీ ఇచ్చిన విషయం విధితమే. తాజాగా అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ జిఒకు ప్రత్యామ్నాయంగా చేసిన ప్రతిపాదనలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. గ్రామ స్థాయిలో పేదలకు విద్యనందించే పాఠశాలలను అభివృద్ధి చేయాల్సిందిపోయి విలీనం దిశగా అడుగులు వేస్తోంది. కార్పొరేట్ బడులకు మేలు చేకూర్చే విధంగా అసంబద్ధ నిర్ణయాలు తీసుకుంటోంది. జిల్లాలో ప్రతి మండలంలో ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు నెలకొల్పేలా ప్రతిపాదనలను సిద్ధం చేయాలని విద్యాశాఖ ఆదేశించింది. ఈ మేరకు గుట్టు చప్పుడు కాకుండా ప్రతిపాదనలు సైతం సిద్ధం చేసి ఇటీవల సమావేశం నిర్వహించింది. జిల్లాలోని ప్రతి పల్లెలో 3 కిలోమీటర్ల పరిధిలో ప్రాథమికోన్నత పాఠశాలలు, 5 కిలో మీటర్ల పరిధిలో ఉన్నత పాఠశాలలు గతం నుంచి నడుస్తున్నాయి. అయితే కూటమి ప్రభుత్వం విలీనం పేరుతో సర్కారు బడులకు నష్టం చేకూర్చేలా చర్యలు చేపడుతుంది. విలీనం ప్రక్రియ వద్దని అన్ని ఉపాధ్యాయ సంఘాలు తల్లిదండ్రులు, టీచర్లు మొరపెట్టుకుంటున్నా కూటమి సర్కారు పెడచెవిన పెడుతోంది. విలీనం ప్రక్రియ చేపడితే గ్రామం నుంచి విద్యార్థులు వేరే గ్రామాలకు వెళ్లి చదవాల్సిన పరిస్థితి ఉంటుందని తల్లిదండ్రులు అంటున్నారు. డ్రాపౌట్స్ శాతం పెరుగుతుందని విద్యావేత్తలు వాపోతున్నారు. ఈ విలీన కసరత్తు పూర్తి అయితే తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకు పిల్లలను పంపడం ఖాయమని టీచర్లు చెబుతున్నారు.జిల్లాలో ఏకోపాధ్యాయ పాఠశాలలను గుర్తించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. 60 మంది విద్యార్థులు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను మోడల్ ప్రైమరీ పేరుతో మార్చేందుకు కసరత్తు చేసున్నారు. ఈ మోడల్ ప్రైమరీ స్కూళ్ల ఏర్పాటుకు జిల్లాలోని 19 మండలాల్లో 10 మండలాల్లో కసరత్తు పూర్తి చేసినట్లు తెలుస్తోంది.

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు	
ప్రాథమిక పాఠశాలలు	712
ప్రాథమికోన్నత పాఠశాలలు	72
ఉన్నత పాఠశాలలు	201

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య	
జడ్‌పి పాఠశాలలు	4,662
ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు	81,268
మున్సిపల్ స్కూల్ విద్యార్థులు	13,363

యుపి స్కూల్స్‌ను హైస్కూల్సుగా అభివృద్ధి చేయాలి



యుపి స్కూల్ స్‌ను విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా హైస్కూల్స్‌గా మార్చాలి. ప్రతి విలేజీలో మోడల్ స్కూల్ అంటున్నారు. ఈ సాకుతో దగ్గరలోని పాఠశాలల్లో ఉండే 3,4,5 తరగతులన కలుపుతున్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు విద్యకు దూరమవటంతో పాటు బాలికల విద్యపై తీవ్ర ప్రభావం పడనుంది. ప్రభుత్వం పునరాలోచించాలి. నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.

- ఎ.షరీఫ్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి



వాకర్స్‌ను కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్న పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి డివి.రాఘవులు

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి రాఘవులు విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - కాకినాడ

ఫిబ్రవరి 27 న జరుగబోతున్న తూర్పు-పశ్చిమ గోదావరి పట్టభద్రుల నియోజకవర్గంలో యుటిఎఫ్, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్, ప్రజా సంఘాల బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు ఆదివారం నగరంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. నగరంలో వివిధ ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో పని చేస్తున్న పట్టభద్రులను కలుసుకుని శాసన మండలిలో పిడిఎఫ్ ఎంఎల్‌సిలు చేస్తున్న కృషిని వివరించారు. అధికార, ప్రతిపక్షాల వైపు కాకుండా పిడిఎఫ్ నిరంతరం ప్రజాపక్షం నిలబడుతుందన్నారు. 2007 శాసనమండలి పునరుద్ధరణ జరిగినప్పటి నుంచి ఇప్పటివరకు 17 మంది పిడిఎఫ్ ఎంఎల్‌సిలు శాసన మండలికి వన్నె తెచ్చారని తెలిపారు. ఆదివరం ఉదయం నగరంలో వివిధ ప్రాంతాల్లో వాకర్స్‌ను కలుసున్న రాఘవులు తన ఉద్యమ నేపథ్యాన్ని స్వయంగా వివరించారు. ప్రస్తుత ఎంఎల్‌సి ఇళ్ళ వెంకటేశ్వరరావు (ఐవి) స్థానంలో తనను పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థిగా ప్రతిపాదించారని రాఘవులు తెలిపారు. కాకినాడ నగరం పరిసర ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్, మహిళలతో పాటు ముఖ్యంగా నిరుద్యోగ పట్టభద్రులు దిడ్ల వీర రాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచారంలో ప్రజా సంఘాల నాయకులు పలివెల వీరబాబు, కె.సత్తిరాజు, మలక వెంకటరమణ, బొజ్జా అశోక్, వై. నాగేశ్వరరావు, బుర్రా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్లలో పంటను విక్రయించుకోవాలి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలో కూరగాయలు సాగు చేస్తున్న రైతులు స్థానిక మార్కెట్లో లేదా దళారులకు తక్కువ ధరలకు వాటిని అమ్మి నష్టపోవద్దని, నగరంలో అందుబాటులో ఉన్న రైతు బజార్లలో ఉత్పత్తులను విక్రయించుకోవాల్సిందిగా , మరింత సమాచారం కోసం మార్కెటింగ్ అధికారులను సంప్రదించాలని జెసి ఎస్. చిన్న రాముడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో వాతా వరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున కూరగాయల పంటలు అంచనాకు మించి దిగుబడిని వస్తున్నాయన్నారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో రైతులు పండించిన కూరగాయలను సరైన ధర రాకపోవడం వల్ల బయట పారవేస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. అమ్ముకోలేక, గిట్టుబాటు ధర లేకపోవడంతో తోటలను దున్నేస్తున్నారనానరు. కనుక రైతులు సాగుచేసిన కూరగాయలను స్థానిక మార్కెట్లో దళారులకు తక్కువ ధరలకు అమ్మి నష్టపోకుండా ఉండటానికి రాష్ట్రంలోని మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకున్నామని జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం. సునీల్ వినయ్ తెలిపారు. రైతుబజార్ల ఎస్టేట్ అధికారులను, స్థానికంగా ఉన్న ఉద్యానవన సిబ్బందిని సంప్రదించి పంటలను తీసుకొచ్చి అమ్ముకోవాల్సిందిగా కోరారు. మరింత సమాచారం కోసం ఎస్టేట్ అధికారులు 9949131315 (శ్రీనివాస్) , 9849333136 (వెంకటేశ్వర రావు) , 9059271999 (తేజ)లను సంప్రదించాలని సూచించారు.

19 న పెన్షన్, జిపిఎఫ్ అదాలత్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో ఈ నెల 19వ తేదీ ఉదయం 10గంటలకు తూర్పు గోదావరి జిల్లా పరిధి లోని పెన్షన్, జిపిఎఫ్ అదాలత్ జరుగుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ శాంతిప్రియ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులు, డ్రాయింగ్ అండ్ పంపిణీ అధికారులు వారి కార్యాలయాల్లో, శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న పెన్షన్ కేసులు, పెన్షన్ అనుబంధ సమస్యల వివరాలతో హాజరుకావాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పెన్షన్స్, జిపిఎఫ్ కేసులను సమీక్షించి అక్కడికక్కడే పరిష్కరిస్తామన్నారు. వివిధ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగుల పెన్షన్ ప్రతిపాదనలు, ఉద్యోగ విరమణ తేదీకి ముందే సంబంధిత జిల్లా డ్రాయింగ్ అండ్ పంపిణీ అధికారులు వారి పెన్షన్ పత్రాలను సమర్పించే విధంగా అవగాహన కల్పిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయం ద్వారా రాష్ట్రంలో ఇప్పటి వరకు విశాఖపట్నం, చిత్తూరు, కర్నూలు, కడప, పాడేరు, తిరుపతి, ఎపి సెక్రటేరియట్ వెలగపూడి, ఎపి డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మంగళగిరిలోను పెన్షన్, జిపిఎఫ్ అదాలత్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు శాంతిప్రియ తెలిపారు. తూర్పుగోదావరి రాజమండ్రిలో ఈ నెల 19 న ఆర్ట్స్ కళాశాల లో నిర్వహిస్తున్నామన్నారు. సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ (అకౌంట్స్) పి.కిషోర్‌రెడ్డి పోలు, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ (అర్హతలు) వి.లలిత్ కుమార్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్ జి.సునీత, టి.విజయ్ కుమార్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్/జిపిఎఫ్. డి చంద్ర శేఖర్ హాజరవుతున్నట్లు తెలిపారు. కావున జిల్లాలోని పెన్షనర్లు, జిల్లా అధికారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఖజానా అధికారి ఎన్.సత్యనారాయణ కోరారు.

సర్వే సిబ్బందికి సహకరించాలి

ప్రజాశక్తి - రాజానగరం

భూ రీసర్వే చేసే సమయంలో యజమానులు అందుబాటులో ఉండి సర్వే సిబ్బందికి సహకారించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. రాజానగరం మండలం తోకాడలో రీసర్వేపై ఆదివారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెసి పాల్గొని మాట్లాడారు. 'మన భూమి - మన భవిష్యత్'లో భాగంగా క్షేత్ర స్థాయిలో భూముల రీ సర్వే చేపడుతున్నామన్నారు. రీ సర్వే సమయంలో భూ యజమాని అందుబాటులో ఉండి సరిహద్దులకు సహకారం అందించాలని కోరారు. దీని ద్వారా వివాదాలు పరిష్కారం అవుతాయన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్.కృష్ణనాయక్, తహశీల్దార్ జివిఎల్.దేవి, ఎంపిడిఒ ఝాన్సీ, సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం సెక్షన్, 33/11 కెవి.పాలంగి సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతు పనులు జరుగుతున్నందున సోమవారం పాలంగి, కె.సావరం, చివటం గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తాత్కాలికంగా విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నామని నిడదవోలు ఎపిఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.నారాయణఅప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆ గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఆదివారం ఆసుపత్రికి సెలవు

ప్రజాశక్తి- దేవరపల్లి

సాధారణంగా ప్రభుత్వ ఆసుపత్రులకు సెలవు ఉండదు. ఎవరొకరు ఆసుపత్రిలో అందుబాటులో ఉండి వైద్యం అందేలా చూస్తారు కాని గౌరీపట్నంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మాత్రం ఆదివారం మూతబడింది. ఆసుపత్రికి తాళాలు వేసి వెళ్లిపోయారు. అత్యవసర సేవలకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వహించాల్సిన వైద్యులు గాని, వైద్య సిబ్బంది గాని లేకుండా ఆసుపత్రికి తాళం వేసుకుని వెళ్లిపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రైమరీ హెల్త్ సెంటర్లు లక్ష్యానికి దూరమవుతున్నాయి జ్వర పీడితులు, ఇతర రోగాల బారిన పడినవారు అందుబాటులో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్తే వైద్య సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని ,సరైన వైద్య సేవలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు .ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి డాక్టర్లు, సిబ్బంది ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. పిహెచ్‌సిలో ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ తెరచి ఉంచాలి. కాని చాలాచోట్ల వైద్య సిబ్బంది సమయపాలన పాటించడం లేదు ఈ క్రమంలో ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు డాక్టర్లతో పాటు సిబ్బంది సైతం అందుబాటులో లేకపోవడంతో ప్రజలకు వైద్య సేవలు అరకొరగా అందుతున్నాయి ఆదివారం పిహెచ్‌సికి తాళం వేసి ఉండటంతో స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన వైద్యులు, వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

దీనిపై పిహెచ్‌సి సిహెచ్‌ఒ కృష్ణుడిని వివరణ కోరాగా సిబ్బందే రాత్రి సమయంలో కూడా డ్యూటీ చేయడం వల్ల స్టాఫ్ నర్సులు అందుబాటులో లేరన్నారు. ఆదివారం కావడం వలన డాక్టర్ హాఫ్ డ్యూటీలో ఉంటారన్నారు. అవసరమైతే అత్యవసర కేసులకు అటెండ్ అవుతారని తెలిపారు. పిహెచ్‌సికి సిబ్బంది కొరత ఉందన్నారు. తాళాలు వేసివుండడంపై ఆ సమయంలో డ్యూటీలో ఉన్న సిబ్బందిని విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఆదివారం తాళం వేసి ఉన్న గౌరీపట్నం పిహెచ్‌సి

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

డిఇఒ వాసుదేవరావు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు విద్యార్థులకు సూచించారు. స్థానిక ఎస్‌కెవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పది విద్యార్థుల ప్రత్యేక తరగతులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. పది పరీక్షలకు ఇక సరిగ్గా 28 రోజులు మాత్రమే సమయం ఉందన్నారు. సమయాన్ని చక్కగా వినియోగించుకున్నవారే విజేతలుగా నిలుస్తారన్నారు. విద్యా సంవత్సరం అంతా చదివింది ఒక ఎత్తయితే ఈ 28 రోజులూ చదివింది అత్యంత కీలకం అన్నారు. ఇప్పటి వరకూ జరిగిన అన్ని పరీక్షల్లో ఏయే అంశాల్లో మార్కులు తగ్గుతున్నాయో చూసుకుని, ఉపాధ్యాయులతో సందేహాలను నివృత్తి చేసుకుని నూరు శాతం మార్కులు సాధించేలా కృషి చేయాలన్నారు. ఈ 28 రోజులూ ఆట పాటలకు, సోషలిమీడియాకు, మొబైల్స్‌కు దూరంగా ఉండాలన్నారు. చదువుకే సమయాన్ని వెచ్చించాలన్నారు. అలాగే ఆరోగ్యం పట్ల కూడా అత్యంత శ్రద్ధ చూపాలన్నారు. త్వరగా నిద్రపోయి, తెల్లవారు జామునే లేచి సాధన చేయాలన్నారు. సెలవుల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల విద్యార్థులకు బడిలో మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంవిఎం.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు జి.అప్పారావు, కన్నమదొర, విద్యార్థులు పాల్గొన్నారు.



రెగ్యులరైజేషన్ ప్రక్రియను ప్రారంభించండి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రభుత్వ కళాశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్స్ సర్వీస్ రెగ్యులరైజేషన్ ప్రక్రియ పున్ణ ప్రారంభించాలని కోరుతూ కాంట్రాక్టు లెక్చరర్స్ 475 అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొర్ల మాణిక్యం పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కి వినతి పత్రం అందజేశారు. ఆదివారం స్థానిక చెరుకూరి కళ్యాణమండపంలో ఓ కార్యక్రమానికి హాజరైన మంత్రిని పిఠాపురం జనసేన నాయకులు జోగా వీర వెంకట రమణ, సూరంపూడి సురేష్, మార్నీడి రంగబాబు,వనం వీరబాబు తదితరుల కలిసి వినతి పత్రం అందజేశారు. మంత్రి మాట్లాడుతూ సంబందిత శాఖ మంత్రి లోకేష్ దృష్టికి ఈ విషయం తీసుకెళ్లి న్యాయం జరిగేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నేతల శ్యాంకిరణ్, మూర్తి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు పిజిఆర్ఎస్ రద్దు : కలెక్టర్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 17న జరగాల్సిన పిజిఆర్ఎస్‌ను రద్దు చేశామని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను మీకోసం పోర్టల్ ద్వారా మీ సమీపంలో ఉన్న సచివాలయాల్లో అర్జీలను నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించామన్నారు. ఫిబ్రవరి 27న గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలు జరగనున్న దృష్ట్యా జిల్లా , డివిజన్, మండల స్థాయిలో సోమవారం పిజిఆర్ఎస్ సెషన్‌లు రద్దు చేశామన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు అంటే మార్చి 8వ తేదీ వరకు ఈ రద్దు అమలులో ఉంటుందన్నారు. ఫిర్యాదుల నమోదు కోసం సమీపంలోని సచివాలయాన్ని సందర్శించాలన్నారు. ఎన్నికల కోడ్ ఎత్తివేసేవ రకూ ఫిర్యాదులను సమర్పించడానికి "మీకోసం" ఆన్‌లైన్ పోర్టల్‌ని ఉపయోగించుకోవాలన్నారు. దీన్ని ప్రజలు గమనించాలన్నారు.

విద్యార్థులకు పోటీతత్వాన్ని అలవాటు చేయాలి

తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ తిరుమలరావు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం


విద్యార్థులకు చిన్ననాటి నుంచే పోటీతత్వాన్ని అలవాటు చేయాలని తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు అన్నారు. ఆదివారం తణుకు తిరుమల విద్యాసంస్థల ప్రాంగణంలో 5,6,7,8,9,10వ తరగతులు పూర్తి చేస్తున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఆదివారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడారు. అవగాహనా సదస్సుకు అనూహ్య స్పందన లభించిందన్నారు. సుమారు 4 వేల మంది హాజరయ్యారని తెలిపారు. పిల్లలలకు ప్రణాళికా బద్ధంగా చిన్ననాటి నుండే మంచి నడవడిక, పెద్దల పట్ల గౌరవం, పోటీతత్వాన్ని అలవాటు చేయాలన్నారు. అప్పుడే భవిషత్తులో ఉన్నత శిఖరాలకు ఎదుగుతారన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో దేశవ్యాప్తంగా జరిగే ఇంజినీరింగ్ (జెఇఇ మెయిన్ అండ్ అడ్వాన్స్) నీట్ పరీక్షల్లో ఎంతో కాంపిటీషన్ ఉందన్నారు. ఆ ఒత్తిడిని తట్టుకుని పిల్లలు నిలవాలంటే తల్లిదండ్రుల ప్రోత్సాహం అవసరమన్నారు. మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండేలా సన్నద్ధం చేయాలన్నారు. జాతీయ స్థాయి పోటీపరీక్షల్లో విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో పిల్లలు ఆరు బయట ఆడుకునే ఆటలను వదిలేసి మొబైల్ ఫోన్లలో ఆటలు ఆడుతున్నారన్నారు. మొబైల్స్‌లో ఎక్కువ సమయం గడిపితే జరిగే నష్టం గురించి తల్లిదండ్రులు తమ పిల్లలకు వివరించాలని సూచించారు.

తిరుమల విద్యాసంస్థల డైరెక్టర్ నున్న సరోజనిదేవి మాట్లాడుతూ ఒక కుటుంబంలో తల్లి తన పాత్రను సమర్థంగా నిర్వహిస్తే ఆ కుటుంబమంతా ఎంతో ఉన్నతంగా ఉంటుందన్నారు. పిల్లల ఎదుగుదలలో తల్లిదండ్రులదే ప్రముఖ పాత్ర అని స్పష్టం చేశారు. ప్రతి తల్లి తమ పిల్లలకు విలువలతో కూడిన విద్యను వారికి అందించే ప్రయత్నం చేయాలని తెలిపారు. తిరుమల పూర్వ విద్యార్థి నేహ సంజన తల్లి లక్ష్మీశిరీష, పూర్వ విద్యార్థి వైష్ణవి తండ్రి ఎసి.వరప్రసాద్ పాల్గొని తిరుమల విద్యాసంస్థతో వారికున్న అనుభవాలను పంచుకున్నారు. ఈ సదస్సులో విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సతీష-బాబు, ప్రిన్సిపల్ వి.శ్రీహరి, తణుకు కాలేజ్ ప్రిన్సిపల్ కె.దుర్గా ప్రసాద్, తణుకు స్కూల్ ఇన్‌ఛార్జి విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న

కార్టూ'నిజం'



ఇసుక లారీల ఇష్టారాజ్యం

- మోతాదుకు మించి లోడుతో రాకపోకలు
- రోడ్లను కప్పేస్తున్న ఇసుకతో వాహనదారుల ఇబ్బందులు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం రూరల్ ధవళేశ్వరంలో ఇసుక లారీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. గ్రామంలో నుంచి అధికలోడుతో ఇసుకను తరలిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. అతివేగంగా వెళ్తున్న భారీ ఇసుక లారీల నుంచి ఇసుకజారి రోడ్డుపై పడుతోంది. దీని వల్ల వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇసుకలో బైకులు స్కిడ్ కావడంతో కింద పడి గాయాలబారిన పడుతున్నారు. గ్రామంలోని హైవే నుంచి పోలీస్‌స్టేషన్, కాటన్ బ్యారేజీవైపునకు వెళ్లే రహదారులపై ఎక్కడికక్కడ ఈ ఇసుక మేటలు కనిపిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే కాటన్ బ్యారేజ్ సెంటర్‌లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇక్కడ మలుపులో భారీగే ఇసుకపోగుబడింది. ద్విచక్ర వాహనదారులు దీనిగుండా ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆదివారం చర్చికి వెళ్తున్న వృద్ధ దంపతుల బైకు ఇసుకలో స్కిడ్ అవ్వడంతో కింద పడిపోయారు. వారికి రక్తపు గాయాలయ్యాయి. ఇసుకల లారీల రాకపోకలను నిలువరించాలని స్థానికులు కోరుతున్నారు.



స్థానికుల శ్రమదానం

కాటన్ బ్యారేజీ సెంటర్ మలుపు వద్ద ప్రమాదకరంగా పరిమణించిన ఇసుకను స్థానికులు శ్రమదానం చేసి తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇసుకను పార, గమేళాలతో ఇసుకను తీసివేశారు. ఇది చూసైనా పాలకులు, ఉన్నతాధికారులు, పంచాయతీ వారు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ మెంబర్ ఒంటెద్దు స్వామి, కె.నాగరాజు, ఆలపాటి చంద్రశేఖర్, టి.ప్రకాశరావు, డి.శ్రీనివాసరావు, జి.సూర్యనారాయణ, కె.జగన్నాథరావు, టి.ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.





నేరాలు ఘోరాలు

పేకాట శిబిరాలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని చిన్న బ్రహ్మదేవం, చదలాడ గ్రామాల్లో ఎస్ఐ వి.మౌనిక ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పోలీసులు నిర్వహించిన దాడుల్లో పేకాడుతున్న 11 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.10,050 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సామర్లకోటలో...

మండలం వేట్లపాలెం గ్రామంలో పేకాట శిబిరంపై సిఐ కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం తెల్లవారుజామున దాడి చేశారు. ఈ దాడిలో 14మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1,21,050 నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

10 లీటర్ల సారాతో మహిళ అరెస్ట్

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని ఆర్‌బి.కొత్తూరు గ్రామంలో ఆదివారం సాయంత్రం ఎస్ఐ వి.మౌనిక ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన దాడిలో 10 లీటర్ల సారాతో మహిళను అరెస్టు చేశారు. ఆమెపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయితో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని నీలాద్రిరావుపేట నుంచి జెడ్ రాగంపేట వెళ్లే దారిలో గంజాయిని తరలిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి మోటార్ సైకిల్‌తోపాటు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ ఆదివారం మీడియా సమావేశంలో వెల్లడించారు. ఏజెన్సీకి చెందిన రాజవొమ్మంగి, జి.మాడుగుల ప్రాంతం నుంచి గంజాయిని తక్కువ మోతాదులో తెచ్చి, గండేపల్లి, సామర్లకోట, కాకినాడ, కిర్లంపూడిలో యువతకు చిల్లరగా అమ్ముతున్న ముద్దాయిలపై నిఘా పెట్టినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే పోలీసులకు వచ్చిన ముందస్తు సమాచారంతో శనివారం రాజవొమ్మంగికి చెందిన కెకె.సాగర్, మాడుగులకు చెందిన కెపి.కుమార్, సామర్లకోటకి చెందిన పికె.కృష్ణలను గంజాయి తరలిస్తుండగా అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో కిర్లంపూడికి చెందిన మరొక ముద్దాయి పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరిని కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. గంజాయితోపాటు, స్వాధీనం చేసుకున్న మొత్తం రూ.61,500 ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ శివనాగు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రావెల్ ట్రాక్టర్ స్వాధీనం
ఇద్దరిపై కేసు నమోదు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చేందుర్తి గ్రామంలో పోలవరం, పుష్కర కాలువల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న గ్రావెల్ ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం అర్ధరాత్రి రెండు గంటలకు అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు దాడి చేశారు. పోలవరం, పుష్కర కాలవ గట్టు నుంచి అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌ని అదుపులో తీసుకున్నారు .గ్రావెల్ పోస్తున్న జెసిబి డ్రైవర్ పరారయ్యాడు. ట్రాక్టర్ డ్రైవర్ కొరిమిల్లి సురేష్, వజ్రకోటంకు చెందిన జెసిబి డ్రైవర్ వాసా రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

రైలు నుంచి జారిపడి
యువకుని మృతి

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట రైల్వే స్టేషన్‌లో రైలెక్కుతూ జారిపడి యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ నాయకర్ కాలనీకి చెందిన వాకాడ జాన్‌బాబు (27) దుర్మరణం చెందారు. సామర్లకోట రైల్వే స్టేషన్లో నూజివీడు వెళ్లేందుకు తన తండ్రి, భార్య, కుమారుడితో కలిసి జాన్‌బాబు రైలు ఎక్కుతుండగా శనివారం ప్రమాదవశాత్తు జారి పడిపోయాడు. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో బాలుని మృతి

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరంలోని జాతీయ రహదారిపై ఆటోను బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒక బాలుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో అన్నవరం నుంచి తుని వెళుతున్న ఆటో మండపం సెంటర్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా బైక్‌పై వస్తున్న యువకులు ఆటోను ఢీకొట్టారు. అన్నవరానికి చెందిన సుశాంత్ (16) అనే బాలుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఎస్ఐ హరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్తీర్ణతా శాతం పెంపే లక్ష్యం

ఆర్ఐఒ జిఎస్ఎల్‌వి నర్సింహులు





ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో ఉత్తీర్ణత శాతం పెంపు లక్ష్యంగా ప్రభుత్వ ఆదేశాలతో ఇంటర్మీడియట్ విద్యా మండలి సంకల్ప్-2025 రూపొందించిందని ఆర్ఐఒ నర్సింహులు తెలిపారు. దానికనుగుణంగా కార్యాచరణ నిర్వహించామని తెలిపారు. ఇప్పటికే ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు పూర్తయ్యాయన్నారు. ప్రభుత్వ, వివిధ సంక్షేమ, ఎయిడెడ్ యాజమాన్యాల పరిధిలో విద్యనభ్యస్తున్న విద్యార్థులు పరీక్షలకు సిద్ధం అవుతున్నారు. ఇంటర్మీడియెట్ విద్యామండలి ప్రకటించిన సంకల్ప్-2025 మంచి ఫలితాలను ఇస్తుందన్నారు.

జిల్లాలో కళాశాలలు ఎన్ని, ఎంత మంది విద్యార్థులు ఉన్నారు.

జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వేతర కాలేజీలు మొత్తం 125 ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు 16, ఎయిడెడ్ 2, సోషల్ వెల్ఫేర్ కాలేజీలు 6తో పాటు హైస్కూల్ ప్లస్ మరో 23 కాలేజీలు కలిపి మొత్తం 47 కాగా మిగిలినవి 78 కాలేజీలు ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీలు ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలు నిర్వహిస్తున్నాయి. జిల్లాలో ఇంటర్మీడియెట్ విద్యార్థులు 23,530 మంది విద్యనభ్యసిస్తుండగా, ద్వితీయ సంవత్సరం 20,880 మంది విద్యనభ్యసిస్తున్నారు.

ప్రభుత్వ, ఎయిడెడ్, యాజమాన్యాల పరిధిలో ఎంత మంది

ప్రభుత్వ, ఎయిడెడ్, ఇతర సంక్షేమ విభాగాల నిర్వహణలోని కాలేజీలలో మొత్తం 8,444 మంది విద్యార్థులు ఇంటర్మీడియెట్ విద్యను అభ్యసిస్తున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియెట్ విద్యార్థులు 4,733 మంది, ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియెట్ విద్యార్థులు కేవలం 3,711 మంది ఉన్నారు. 2024 మార్చి పరీక్ష ఫలితాల్లో మొదటి సంవత్సరం ఇంటర్మీడియెట్ విద్యార్థులు 75 శాతం మంది పాస్ పర్సంటేజీ నమోదు కాగా, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 85 శాతం సాధించారు. రాష్ట్ర స్థాయిలో జిల్లాకు 5వ స్థానం లభించింది. ఈ విద్యా సంవత్సరం 100 శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా సంకల్ప్ అమలు చేస్తున్నాం.

ఇంటర్మీడియెట్ విద్యార్థుల సిలబస్ పూర్తి చేశారా

ఇంటర్మీడియెట్ విద్యార్థుల సిలబస్ సకాలంలోనే పూర్తి చేశామన్నారు. ఈ విద్యా సంవత్సరం విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు అందజేశాము. ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాము. ప్రతి లెక్చరర్‌కు శ్రద్ధ తీసుకోవాల్సిన కేటాయించడంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాము. ఉత్తమ ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాము.

సంకల్ప్-2025 ఎలా అమలు చేశారు.

తాజా విధానం ప్రకారం కేర్ టేకర్ విధానం అమల్లోకి తెచ్చాం. విద్యార్థులను ఎ, బి, సి కేటగిరీలుగా విభజించాం. బి, సి కేటగిరీ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించాం. ఈ విధానంతో తరగతుల పని వేళలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలకు పరిమితం చేశారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. ప్రతి లెక్చరర్‌కి కాలేజీలలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా కేటాయింపులు చేశాము.

యానాం వార్తలు



ఎంపి వైద్యలింగంకు నివేదికను అందిస్తున్న ఫోరమ్ ప్రతినిధులు

ఎంపి వైద్యలింగంకు అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ నివేదిక

ప్రజశక్తి - యానాం

యానాంలో నెలకున్న సమస్యలు, పారిశ్రామికంగా ఉన్న అనుకూల, ప్రతికూల అంశాలపై రూపొందించిన నివేదికను ఎంపి వైద్యలింగం, మాజీ సిఎం వి.నారాయణస్వామిలకు అందజేశారు. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ సంబంధిత నివేదికను రూపొందించింది. ఈ నివేదికను యానాం సిటిజన్ ఫోరమ్ పక్షాన ప్రముఖ పారిశ్రామికవేత్త ఈలప్రోలు విష్ణువర్ధనరావు, అన్యం రామకృష్ణారావు, నామాడి అప్పారావు, దాట్ల దేవదానంరాజు అందజేశారు. అలాగే యానాంకు చెందిన ప్రముఖకవి, కథారచయిత దాట్ల దేవదానంరాజు వృద్ధాప్యంపై రచించిన 'నాలుగో పాదం' కవితా సంపుటిని తమిళంలో అనువాదం చేసి రచయిత వారికి అందజేశారు.

అంధత్వ నివారణకు కృషి చేయాలి

ప్రజాశక్తి - సామర్లకోట



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సమాజంలో అంధత్వ నివారణ కోసం స్వచ్ఛంద సేవా సంస్థలు కృషి చేయాలని తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు పాలకుర్తి శ్రీనివాసాచార్యులచౌదరి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలో జి.మేడపాడు గ్రామంలో తూర్పు కాపు విద్యా విజ్ఞాన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కిరణ్ కంటి ఆసుపత్రి కంటి వైద్యులు డాక్టర్ అనూష వైద్య పరీక్షలు నిర్వహించి 40 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. ఈ వైద్య శిబిరంలో కిరణ్ కంటి ఆసుపత్రి ప్రోగ్రాం మేనేజర్ సత్యనారాయణ, తూర్పు కాపు విద్యావిజ్ఞాన సంక్షేమ సంఘ అధ్యక్షులు నూకిరెడ్డి శ్రీనివాసు, వైస్ ప్రెసిడెంట్ పిల్లా సత్యనారాయణ, సెక్రెటరీ పైలా సత్యనారాయణ, జాయింట్ సెక్రెటరీ డేగల వీరబాబు, ట్రెజరర్ జామి యేసుకృష్ణ తదితరులు సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జానా వెంకట్రావు, సంఘసభ్యులు జామి శ్రీనివాస్, పిల్లా అప్పలరాజు, కర్రి రామకృష్ణ, పైలా వెంకటేశ్వరరావు, ఉగ్గిన సూర్య భాస్కరరావు, పటాని వేణుగోపాల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న స్వర్ణాంధ్ర ప్రతినిధులు

స్వర్ణాంధ్ర ఆధ్వార్యాన దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

అవసరార్థులకు స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి, పుష్కరాల రేవు వద్ద దుస్తుల పంపిణీ చేసినట్లు స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిర్వాహకులు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు తెలిపారు. హుదూద్, తిత్లి తుపాన్ వంటి వివిధ విపత్తులు సంభవించినప్పుడు, అగ్ని ప్రమాద బాధితులకు, నిరాశ్రయులకు దుస్తుల పంపిణీ చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు ఐదు లక్షల జతల దుస్తులు పంపిణీ చేసినట్లు రాంబాబు తెలిపారు. ఆనందాల గోడ(వాల్ ఆఫ్ హ్యాపీనెస్)అనే కార్యక్రమం ద్వారా 2016 నుంచి రాజమహేంద్రవరం, విశాఖ, తూర్పుగోదావరి, మన్యం ప్రాంతాలతో కలిపి పలుచోట్ల అవసరార్థులను గుర్తించి దుస్తులు పంపిణీ చేస్తున్నామన్నారు. దుస్తులు సమకూర్చి ఇస్తున్న దాతలకు రాంబాబు ధన్యవాదాలు తెలిపారు. 2016లో అప్పటి రాజమండ్రి మున్సిపల్ కమిషనర్ విజయరామరాజు, సబ్ కలెక్టర్ విజయ కృష్ణన్ చేతుల మీదుగా ఈ సరికొత్త కార్యక్రమం ప్రారంభించబడిందని అన్నారు. అదనంగా ఉన్న దుస్తులను శుభ్రపరిచి, ఇస్త్రీ చేసి లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమానికి అందిస్తే అవి తిరిగి అవసరార్థులకు పంపిణీ చేస్తామని రాంబాబు దాతలను కోరారు.

కూటమి వైఫల్యాలపై ప్రజలను చైతన్యం చేయాలి

ప్రజాశక్తి - అంబాజీపేట



బొత్సను శాలువాతో సత్కరిస్తున్న పి.గన్నవరం కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు

కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక వైఫల్యాలపై ప్రజలను చైతన్యం చేయాలని ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ బొత్స సత్య నారాయణ సూచించారు. విశాఖ పట్నం సిరిపురంలో ఆదివారం పి.గన్నవరం నియోజవర్గకు కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పార్టీ శ్రేణులతో బొత్సను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు అందరినీ సమన్వయం చేసుకుంటూ వైసిపిని ముందుకు నడిపించాలని సూచించారు. ఈ సందర్భంగా బొత్సకు శాలువ కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంబాజీపేట మండల శాఖ అధ్యక్షులు విత్తనాల ఇంద్ర శేఖర్, మామిడికుదురు సొసైటీ మాజీ అధ్యక్షులు కటకం శెట్టి ఆదిత్య, నేదునూరు పెదపాలెం మాజీ సర్పంచ్ వాసంశెట్టి తాతాజీ, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు తాత్కాలిక విరామం

ప్రజాశక్తి - అమలాపురం

తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల కు సంబంధించిన పట్ట భద్రుల శాసనమండలి ఎన్నికల ప్రవర్తన నియ మావళి అమలులో ఉన్నందున ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి తాత్కాలిక విరామం ప్రకటించామని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3వ తేదీ నుంచి మార్చి 8 వ తేదీ వరకు ప్రతి సోమవారం స్థానిక కలెక్టరేట్, మూడు రెవెన్యూ డివిజన్లు, మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమానికి తాత్కాలిక విరామం ప్రకటించామని ఆయన పేర్కొన్నారు. మీకోసం ఆన్లైన్ పోర్టల్లో అర్జీదారులు తమ తమ సమస్యలను రాత పూర్వకంగా నమోదు చేసుకోవచ్చునని లేదా సమీప గ్రామ లేదా వార్డు సచివాల యాల ద్వారా ఆన్లైన్లో అర్జీలు నమోదు చేయించుకొన వచ్చునని కలెక్టర్ సూచించారు.

ప్రయివేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ప్రయివేటు పాఠశాలల సమస్యలను సిఎం , విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక ఆపిల్ స్కూల్ నందు గోదశి పుండరీష్ అధ్యక్షతన ఆదివారం జిల్లా ప్రయివేటు స్కూల్ కరస్పాండెంట్ల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రయివేటు పాఠశాలల కరస్పాండెంట్లు రాష్ట్రలీగల్ అడ్వైజర్ ముతుకుమిల్లి శ్రీ విజయ్ మాట్లాడుతూ ప్రభుత్వ అవలంబిస్తున్న విధానాలతో ప్రయివేటు పాఠశాలలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. ఎక్కడా లేని విధంగా సమాచార హక్కు చట్టంలో లేని అంశాలను అధికారులు ప్రయివేటు పాఠశాలలపై రుద్దటం దారుణం అన్నారు. ముఖ్యం గా విద్యా హక్కు చట్టం 2010 రూల్ నెంబర్ 14లో ఉన్న లోసుగులపై ఇప్పటికే కోర్టు స్టే తీసుకు రాటం జరిగిందన్నారు. దీనిపై పాఠశాల కరస్పా ండెంట్లు, ఎవరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. విశిష్ట అతిథిగా ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో తులిప్స్ రమేష్, ముమ్మిడి ప్రసాద్, మంగళం పల్లి అంజిబాబు, పొత్తూరి లక్ష్మీ శ్రీనివాసన్(రవీంద్ర స్కూ ల్, ముమ్మిడివరం), సత్యనారాయణ (సిద్ధార్థ, సిరి పల్లి), శ్రీనివాస్, నాగులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - సామర్లకోట



జరుగుతున్న పనులపై సమీక్షిస్తున్న చినరాజప్ప

గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప కోరారు. ఆదివారం మండలంలోని అచ్చంపేటలోని ఆయన కార్యాలయంలో హుస్సే న్పురం గ్రామంలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను సమీక్షించారు. ప్రాధాన్యత క్రమంలో పనులు సక్రమంగా నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు చల్లా బుజ్జి, కోట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కోడు కాలువలో చెత్త డంపింగ్

ప్రజాశక్తి - ఆలమూరు

వర్షపు నీరు, సాగులో అధిక నీరు కోడు కాలువ ద్వారా బయటకు పోయి పంటలకు రక్షణగా ఉండేదని, కానీ కోడు కాలువను చెత్త డంపింగ్‌గా మార్చడంతో పంట పొలాల్లో నీరు నిలిచిపోయి పంట చేతికి వచ్చే సమయంలో చేజారి పోతుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం శివారున, పెనికేరు, కలవచర్ల గ్రామాల మధ్య రైతులకు సాగునీరు అందించే కోడు (నీటి కాలువ)ఉందన్నారు. ప్రతి ఏడాది వర్షాకాలంలో ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీరు, చొప్పెల్ల జాతీయ రహదారి చెంతన ఉన్న కాలువ ద్వారా ప్రవహిస్తూ వచ్చే సాగునీరు ఈ కోడులో కలసి తద్వారా కలవచర్లకు చెందిన పంట బోదెలోకి చేరుకుంటుందన్నారు. ఈ కోడు ప్రాంతంలో పలు గ్రామాల నుంచి చెత్తను తరలించి డంపింగ్ యార్డ్ మాదిరిగా ఏర్పాటు చేశారన్నారు. కొన్నేళ్లగా పూర్తిస్థాయిలో పూడికలు తీయకపోవడం, రహదారుల నిర్మాణం, కాలువలను ఆక్రమించుకోవడం, తూరలు మూసుకుపోవడంతో వర్షాకాలంలో నీరు దిగువకు చేరడంలో ఇబ్బందులు తలెత్తుతున్నా యన్నారు. చిన్నపాటి వర్షానికే పంట పొలాల్లో మోకాలు లోతులో నీరు నిలిచిపోతుందని, దీంతో పంట కుళ్లిపోయి రైతుల నష్టాలను చవిచూడాల్సి వస్తుందన్నారు. చొప్పెల్ల, మూలస్థానం, జొన్నాడ, నర్సిపూడి, నవాబుపేట, పెనికేరు, కవచర్ల, ఆలమూరు గ్రామాలలో కొన్ని వందల ఎకరాల్లో పంటపొలాలు నీట మునిగిపోతు న్నాయని అన్నారు. ఇకనైనా మా సమస్యను పట్టించుకుని సంబంధిత అధికారులు, నాయకులు స్పందించి ముందుకు వచ్చి ఆ కోడు సమీపంలో ఆక్రమణలు తొలగించి మూసివేసిన పంటబోదెను తిరిగి పూడిక తీయించాలని రైతులు డిమాండ్ చేశారు. పంట పొలాల్లో నిలిచిన వర్షపునీరు బయటకు పోయే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను రైతులు కోరుతున్నారు.

పలువురికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - మామిడికుదురు




వెరి కోస్ వైద్య పరీక్షలు అందిస్తున్న డాక్టర్

మొగలికుదురు శ్రీ సత్య సాయి కళ్యాణ మండపం లో సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వెరికోస్ వైద్య శిబిరం నిర్వహించి పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు స్వామి, జివి.ప్రవీణ్ కుమార్ వైద్య పరీక్షలు చేసి ఆపరేషన్ అవసరమైన వారిని గుర్తించారు. వారికి హైదరాబాదులో ఉచితయగా ఆపరేషన్లు చేస్తారని సంస్థ జిల్లా అధ్యక్షులు అడబాల కొండబాబు తెలిపారు కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఎంపి వర్ధనరావు, ఎ.కృష్ణ, డాక్టర్ కాశినప్రభాకర్, వాసవిబుజ్జి తదితరులు పాల్గొన్నారు

సుబ్బారావుకు కళాకిరీటి పురస్కారం

ప్రజాశక్తి - కొత్తపేట

కవి, నటుడు, అధ్యాపకుడు, పాత్రికేయుడు డాక్టర్ వివివిఎస్.సుబ్బారావు కళా కిరీటి పురస్కారాన్ని అందుకున్నారు ఎపి భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గోదావరి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మలికిపురం అల్లూరి సత్యనారాయణ రాజు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సాంస్కృతిక కళా సంబరాలు నిర్వహించారు. శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ ఛైర్మన డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సంస్థ జాతీయ అధ్యక్షురాలు కొల్లి రమావతి, గోదావరి కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్.రామారావు సంస్థ ఉపాధ్యక్షుడు కడలి కృష్ణారావు చేతుల మీదుగా సుబ్బారావు పురస్కారాన్ని అందుకున్నారు. సమకాలీన రైతు సమస్యలపై తాను రచించి అభినయించిన రైతే రాజు ఏకపాత్రాభినయానికి ఈ పురస్కారం లభించింది.



సుబ్బారావుకు పురస్కారం అందజేస్తున్న ప్రముఖులు

ప్రభుత్వ పాఠశాలల్లో బాలల కథల పోటీలు

ప్రజాశక్తి - కాట్రేనికోన

కొల్లు రమణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలల కథల పోటీలు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షులు కొల్లు ఆనంద్, యువ కవి ఎలిపే మధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కథల పోటీలకు మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో 8, 9 తగరతులు చదివే విద్యార్థినీ, విద్యార్థులు అర్హులు అన్నారు. విద్యార్థులు రాసిన కథలలో ఎంపిక చేయబడిన 20 కథలకు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందిస్తామని అన్నారు. ఆసక్తి గల విద్యార్థిని, విద్యార్థులు తమ పేరులను ఈ నెల 20వ తేదీ లోపు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్ నెంబర్ 8466945077లో సంప్రదించాలని ఆనంద్, మధులు కోరారు.

విలసవిల్లిలో మసీదు ప్రారంభం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

విలసవిల్లి ముస్లిం వీధిలో సుమారు రూ.30 లక్షల వ్యయంతో ముస్లింలు మసీదును నిర్మించుకున్నారు. మసీదును ఆదివారం ప్రారంభించుకుని ప్రార్థనలు చేశారు.మసీదును స్థానిక సర్పంచ్ సలాది ఊర్మిళదేవి, వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, మసీదు చైర్మన్ షేక్ జిలానీ ముస్లిం పెద్దలు సందర్శించారు.

ఎల్. గన్నవరం సర్పంచ్ మృతి

ప్రజాశక్తి - పి.గన్నవరం



సర్పంచ్ రామకష్ణ(ఫైల్)

ప్రమాదంలో గాయపడిన లంకల గన్నవరం సర్పంచ్ పసలపూడి రామకృష్ణ (46) రాజమహేంద్రవరం ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మతి చెందారు. ఈ నెల 5 న తాడేపల్లిగూడెం నుంచి వస్తూ బెల్లంపూడి సమీపంలో బైక్‌తో సహా పంట కాలువలో ఆయన పడిపోయారు. స్థానికులు స్పందించి కుటుంబ సభ్యులకి సమాచారం అందించి పి.గన్నవరం ఏరియా ఆసుపత్రిలో చేర్చగా మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తరలించారు. ఆయనకు భార్య సీతారత్నం, కుమారుడు, కుమార్తె ఉన్నారు. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన తరపున పోటీ చేసి సర్పంచిగా ఆయన గెలుపొందారు. వరదల సమయంలో ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి ప్రజల మన్ననలు పొందారు. ఆయన మృతితో గ్రామంలో విషయులు అలుముకున్నాయి. సర్పంచ్ పసలపూడి అకాల మృతికి చింతిస్తూ ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు డొక్కానాథ్ బాబు, ఆరుమిల్లి లాల్ బాబు, ఎంపిపి గనిశెట్టి నాగలక్ష్మి శ్రీనివాస్, జనసేన రాష్ట్ర నాయకులు వాసంశెట్టి కుమార్, ఉమ్మడి జిల్లా జనసేన ఉపాధ్యక్షులుశిరిగినీడి వెంకటేశ్వరరావు, నియోజకవర్గం సర్పంచుల సమాఖ్య అధ్యక్షులు యర్రంశెట్టి వీరాస్వామి, మామిడికుదురు సర్పంచ్ ల సమాఖ్య అధ్యక్షులు అడబాల తాత కాపు,కూటమి నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

IN THE CMURT OF THE 1st ADDITIONAL SENIOUR CIVIL JUDGE:KAKINADA
E.P.No.68/2023in O.S.No.44/2016

Between:-
Pinapothu DhanaLakshmi ...DHR/Plaintiff
And
Viswanadhapalli Murthy Raju and Another ...JDR'S/Defendants

To.
JDR2 Viswanadhapalli manojana, w/o,Viswanadhapalli Murthy Raju, D.No.1-189,Edharapalli Bridge Down, Amalapuram Town,Dr.B.R.Ambedkar Konaseema District.

పై నెంబరు అమలు గ్రంధములో 2వ JDRఅయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లునోటీసులు పంపినను మీరు తీసుకొనక Evoide చేయుచున్నందున శ్రీ కోర్టు వారి మీ హాజరు నిమిత్తం **ది.28-02-2025** తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥10.30ని॥లకు పై శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని మీ వకీలు గారి ద్వారాగాని హాజరయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల పైఅమలు గ్రంధము మీ పరోక్షమున తీర్మానించబడును.

B.Ramalinga Sharma
Advocate ,Kakinada
Cell.9948269699

IN THE COURT OF THE III ADDITIONAL DISTRICT JUDGE,KAKINADA
O.S.No.169/2016

Between
Jakkapu Janaki and Others ...Plaintiff
And
Bande Subba Rao & Others ...Defendants

To. Defendant.19
Dasari Vijaya Rani D/o.(Late)Vishnu Chakram Kandregula Road, Karapa, Kakinada Rural.

పై నెంబరు దావాలో 19వ ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయు చున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.25-02-2025** సం॥రం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆ రోజు ఉదయరం గం॥10.30 ని॥లకు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చు కోవలెఉను. లేనియెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించ బడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
V.N.V.V.శ్రీరామమూర్తి
అడ్వకేట్, కాకినాడ
సెల్ 9848820708

In the Court of the III Additional Senior Civil Judge at Kakinada
H.M.O.P. No. 131/2024

Between:
Kaledandi (Yandrapu) Bhavani ...*Petitioner*
AND
Kaledandi Srinu ...*Respondent*

To:
Kaledandi Srinu, S/o. K.Devana, Hindu, aged 28 years, R/o. D.No. 3-21, B.C.Peta, Gollaprolu Mandal, A.K.Mallavaram, Kakinada District.

పై నెంబరు పిటిషన్‌లో శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయు చున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 04-3-2025 తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల పై పిటీషను మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
VALLURI SATYAVATHI
Advocate, Kakinada
Cell: 9618450662

In the Court of the VIth Additional District Judge at Kakinada
O.S. No. 38/2022

Between:
Karri Nitya Yashmika Reddy ...*Plaintiff*
AND
Smt. Karri Seethamahalakshmi and Others ...*Defendants*

To:
D6: Sri Chinta Ramakrishna, S/o. Sriramulu, Hindu, Business, R/o. D.No. 44-9-1, Paradesamma peta, Jagannadhapuram, Kakinada, Kakinada Urban Mandal.

పై నెంబరు దావాలో 6వ ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా, పోస్టల్ ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 26-3-2025 సం॥ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కూరపాటి పృథ్వీరాజ్
కోకా వెంకట కృష్ణారావు
అడ్వకేట్స్, ప్రతాప్ నగర్
కాకినాడ, సెల్: 9000054365

మహారాజశ్రీ ప్రిన్స్‌పాల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
I.P.No.3/2025

Between:
1. Vijaya Durga Textiles, represented by its Proprietor, Nakkina Dhana Raju, S/o. Satyanarayana, Hindu, Aged 36 years, Calling Nil, resident of D.No.53-12-9/1, Near Chinna Masjid, Rajendra Nagar, Rajamahendravaram, E. G. District.
2. Nakkina Dhana Raju, S/o. Satyanarayana, Hindu, Aged 36 years, Calling Nil, resident of D.No.53-12-9/1, Near Chinna Masjid, Rajendra Nagar, Rajamahendravaram, East Godavari District. ...**Petitioners**

AND

1. M/s Sri Suresh Cut Pieces, represented by its Proprietor, Vemana Suresh, S/o. Father's name Not known, Shop No.76, Mahatma Gandhi Whole Sale Cloth Complex, Thadithota, Rajamahendravaram, E.G.Dt.
2. M/s. Aadi Fab Tex, represented by its Proprietor, Surana Surendra, S/o. Father's name Not known, Shop No.8, Akhil Plaza, Gantalamma Temple, Road, Near Seethamma Sandhu, Rajamahendravaram, E.G.Dt.
3. M/s. Jai Rajendra Textiles, represented by its Proprietor, Javeer Chand, S/o. Father's name Not known, Shop No.B-2, Karri Sura Reddy Complex, Thadithota, Rajamahendravaram, E.G.Dt.
4. M/s. Naga Sai Traders, represented by its Proprietor, Bonu Nageswara Rao, S/o. Father's name Not known, Shop No.12, Chandana Market, Thadithota, Rajamahendravaram, E.G.Dt.
5. M/s. Lakshmi Saranya Textiles, represented by its Proprietor, Vemana Mohan, S/o. Naga Babu, Shop No.205/B, Mahatma Gandhi Whole Sale Cloth Complex, Thadithota, Rajamahendravaram, E.G.Dt.
6. Aleti Srinivas Babu, S/o. Nageswara Rao, Hindu, Aged years, resident of MIG SFS-71, D.No.113-1591,A.P.H.B. Colony, Lalacheruvu, Rajanagaram Mandal, E.G.Dt.
7. Pati Govind, S/o. Nageswara Rao, Hindu, Aged .... years, resident of D.No.53-12-5, Rajendra Nagar, Rajamahendravaram, E.G.Dt.

...**Respondents**

పై గ్రంధములో పిటీషనరు/డెటరు తనకు గల అప్పులు చెల్లించు శక్తి లేదని ఇన్సాల్వెంటుగా/దివాళాదారుగా డిక్లేరు చేయమని కోరుచూ పై పిటీషను దాఖలు చేసియున్నారు. కావున పై తెలిపిన రెస్పాండెంట్సుకు గాని, ఎవరికైనా పై గ్రంధములో ఏమైనా అభ్యంతరములు ఉన్న ఎడల ది.**20-03-2025**తేదీన పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని , ప్లీడరు గారి ద్వారా గాని ఉదయం **గం॥10.30** ని॥లకు హాజరై వారికి గల అభ్యంతరములు పై కోర్టు వారి ఎదుట మనవి చేసుకోవలెను. కావున ఎల్లరకు తెలియపర్చడమైనది.

పురంశెట్టి సత్యరమేష్
కె.వెంకటలక్ష్మి
పి.ధనుంజయసాయి
అడ్వకేట్స్
శ్యామలా నగర్, రాజమండ్రి
సెల్.9505901777

రాజమండ్రి
ది.17-02-2025